

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను కలిసిన కాలనీవాసులు

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తా: ఎమ్మెల్యే

గాజులరామారం, జూన్ 30(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కాలనీలు, బస్తీల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, ప్రజలకు ఇబ్బంది లేకుండా చేస్తామని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. పలు డివిజన్ లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలంటూ పలువురు బస్తీ నాయకులు, ప్రజలు, జీడిమెట్ల డివిజన్, దండమూడి ఎన్‌క్లేవ్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయనను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం పలు శాఖల అధికారులతో మాట్లాడి ప్రజల సమస్యలను తీర్చాలని ఆదేశించారు.

వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలి



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

నిజాంపేట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని కార్పొరేటర్ రవికిరణ్ తెలిపారు. నిజాంపేట్ కార్పొరేషన్‌లోని బాలాజీనగర్‌లో శ్రీశ్రీశ్రీ క్లీనిక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని రవికిరణ్ ఆదివారం ప్రారంభించి, ప్రసంగించారు. ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్లు ప్రజలకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను అందజేశారు. దాదాపు 3 వందల మంది వైద్య పరీక్షలు నిర్వహించుకొని మందులు తీసుకున్నారు.

శ్మశానవాటికలో అభివృద్ధి పనులు పూర్తి చేస్తాం



పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండలోని ముస్లిం శ్మశానవాటికలో చేపడుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముస్లిం శ్మశానవాటికలో ప్రస్తుతం ముఖద్వారం ఆర్చ్, ప్రార్థనహాల్ నిర్మాణం పూర్తయ్యాయని తెలిపారు. ప్రహరీ పెండింగ్‌లో ఉందని దానిని కూడా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు శివరాజ్‌గౌడ్, షౌకత్‌అలీమున్నా, ఫారూఖ్, ఖాజా, సమ్మద్, వాసుదేవరావు, బాలస్వామి సాగర్, ఫిరోజ్, బషీర్, యాకుబ్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న వైద్యులు

మహిళల కేన్సర్ సమస్యలపై సమ్మిట్

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): హైటెక్‌సిటీలోని మెడికవర్ కేన్సర్ ఇనిస్టిట్యూట్‌లో మహిళలు ఎదుర్కొంటున్న కేన్సర్ సమస్యలపై ల్యాండ్ మార్క్ గ్లోబల్ సమ్మిట్‌ను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతకుమారి, డాక్టర్ శరత్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. సమ్మిట్‌లో ఎండోమెట్రియల్, గర్భాశయ, రొమ్ము, అండాశయ కేన్సర్‌లపై కీలక చర్చలు, సాధారణ సెషన్‌లను ఏర్పాటు చేశారు. జననేంద్రియ, రొమ్ము కేన్సర్‌ల గురించి అవగాహన, చికిత్సను మెరుగుపర్చడంపై చర్చించారు. మహిళల అంకాలజీ యొక్క భవిష్యత్‌ను రూపొందించడానికి తామంతా ఉత్సాహంతో కలిసి వచ్చామని మెడికవర్ ఆస్పత్రి సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ శరత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ చైర్మన్ డాక్టర్ రవిచందర్, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సతీష్ కైలాసం, వైద్యులు సరితాశ్రీవాస్తవ, అన్వేష్, పవన్, ప్రవీణ్, మీర్జా అలీ, కార్తీక్, శ్రీరామ్, ప్రభాకర్ పాల్గొన్నారు.



హాజరైన అమీనాపూర్, తెల్లాపూర్ ప్లాట్స్ యజమానులు

మా జాగాలు మాకు ఇప్పించండి

సీఎంకు అమీన్‌పూర్, తెల్లాపూర్ ప్లాట్ల యజమానుల విన్నపం

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): 'మా జాగా మాకు ఇప్పించండి' అని అమీన్‌పూర్, తెల్లాపూర్ ప్లాట్ల యజమానులు సీఎంను వేడుకున్నారు. ఈ మేరకు ఇండస్ట్రీయల్ ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సభ్యుల సర్వసభ్య సమావేశం ఆదివారం కేపీహెచ్‌బీ వసంతనగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సుమారు రెండు వేల మంది సభ్యులు హాజరయ్యారు. ఏబీసీటీ వీపీపీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు అడుసుమల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. న్యాయబద్ధంగా ప్రైవేటు వెంచర్స్‌లో కొనుగోలు చేసిన ప్లాట్లను సర్కారు తమవి అనడంతో గందరగోళం ఏర్పడిందని, న్యాయస్థానం కూడా ప్రజలకు అనుకూలంగా తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు హిమకుమారి, ప్రధాన కార్యదర్శి యాదగిరి, సత్యవంతుడు, శ్రీకాంత్, ఆనంద్, ఆయుబ్‌ఖాన్, కమేరుద్దీన్, అరవింద్‌గౌడ్, హరిబాబు, రమేష్‌బాబు పాల్గొన్నారు.

క్వారీ గుంతలో పడి మేస్త్రీ మృతి

జీడిమెట్ల, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం ప్రాంతంలోని బాలయ్యబస్తీ క్వారీల్లో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇది ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఎవరైనా హత్య చేసి పడేశారా అనే కోణంలో జగద్గిరిగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వరంగల్ ప్రాంతానికి చెందిన సత్తెయ్య(50) అనే వ్యక్తి రెండేళ్లుగా బాలయ్యనగర్‌లో కుటుంబసమేతంగా నివాసం ఉంటున్నాడు. మేస్త్రీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మద్యానికి బానిసైన సత్తెయ్య ప్రమాదవశాత్తు క్వారీ గుంతలో పడి ఉండొచ్చని స్థానికులు భావిస్తున్నారు. ఈ మేరకు జగద్గిరిగుట్ట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్తుండగా..

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



నాగప్ప (ఫైల్)

కూకట్‌పల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కారు అతివేగంగా వచ్చి స్కూటీని వెనుక నుంచి ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. కూకట్‌పల్లికి చెందిన నాగప్ప(70), లక్ష్మి(51)లు బంధువులు. వీరిద్దరు ఆదివారం కూకట్‌పల్లి ఐడీఎల్ రోడ్డులోని రంగనాయకస్వామి ఆలయంలో నిర్వహించే బ్రహ్మోత్సవాల్లో పాల్గొనేందుకు స్కూటీపై వెళ్తున్నారు. జాతీయ రహదారిపై ఐడీఎల్ ఎదురుగా వెళ్తున్న వీరి స్కూటీని అతివేగంగా వచ్చిన కారు (టీఎస్ 07 ఇఆర్ 2727) ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ రోడ్డుపై పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. ఇద్దరిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. నాగప్ప మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. లక్ష్మి చికిత్స పొందుతోంది.

యువకుడి అదృశ్యం

మియాపూర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మియాపూర్ మాతృశ్రీనగర్‌కు చెందిన దుర్గారావు కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 29న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు అంతటా వెతికినా ఆచూకీ తెలియక పోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

యూపీహెచ్‌సీలో

అరకొర సౌకర్యాలు

- విస్తరణ పనులు పేపర్‌లకే పరిమితం
- పెరుగుతున్న రోగులు.. సిబ్బంది, బెడ్‌ల కొరత
- నూతన భవనం నిర్మించాలని వినతి



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

షాపూర్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): షాపూర్‌నగర్ పీహెచ్‌సీలో అరకొర వసతులతో రోగులు అవస్థలు పడుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు, వారి సహాయకులకు ఆస్పత్రిలో సరైన సదుపాయాలు లేక తీవ్ర అవస్థలు పడుతున్నారు. నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వివిధ సమస్యలతో వస్తారు. వీరికి సరిపడా వసతులు, సిబ్బంది లేక నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకు రోగుల సంఖ్య పెరుగుతుండడంతో ఆస్పత్రిని విస్తరించాలని ప్రతిపాదనలు ఉన్నా ఏళ్లు గడచినా విస్తరనకు నోచుకోవడం లేదు. ఆస్పత్రి విస్తరణ పనులు చేయడానికి పక్కనే సుమారు వెయ్యి గజాల ప్రభుత్వ స్థలం ఉన్నా అధికారుల అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఆచరణకు నోచుకోవడం లేదు. ఆస్పత్రి విస్తరణకు 2017లో మండల రెవెన్యూ అధికారులు ఉత్తర్యులు జారీచేసినా అమలు విషయంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆస్పత్రికి రోజూ 100 నుంచి 150 వరకు రోగులు వస్తారని, ఆస్పత్రిలో సరిపడా సిబ్బంది లేక వైద్యం ఆలస్యమవుతోందని ప్రజలు వాపోతున్నారు. ఈ ఆస్పత్రిలో నెలకు సుమారు 40కి పైగా డెలివరీలు జరుగుతున్నాయని వైద్యులు చెపుతున్నారు. ఆసుపత్రిలో ఇన్‌పేషంట్లకు 10 పడకలున్నా అవి సరిపోవడం లేదని తెలిపారు.



ఆసుపత్రి పక్కనే ఉన్న ఖాళీ స్థలం

ఇప్పటికే దుండిగల్, కుత్బుల్లాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. ఇవికాక 12 సబ్ సెంటర్లు ఉన్నా ఎక్కడా సరియైన వసతులు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఆస్పత్రికి వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరుగుతున్నా సదుపాయాలు కల్పించడంతో అధికారులు శ్రద్ధ చూపడం లేదని రోగులు, వారి సహాయకులు వాపోతున్నారు.

ఆరోగ్య కేంద్రంలో సదుపాయాలు పెంచాలి



షాపూర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో రోగులకు అవసరమైన సదుపాయాలు కల్పించాలి. ఆస్పత్రికి నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారని, వీరికి అవసరమైన ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఉన్న ఆస్పత్రి భవనం ఏ మాత్రం సరిపోవడం లేదు. ప్రక్కనే ఉన్న ఖాళీ స్థలంలో నూతన భవనం నిర్మించడానికి అనుమతులు ఉన్నాయి. కానీ పనులు ముందుకు సాగడం లేదు. ప్రస్తుత ప్రభుత్వంలోనే నూతన భవనం నిర్మించి, పేషెంట్లకు అన్ని రకాల సదుపాయాలు కల్పించాలి. సిబ్బందిని పెంచాలి.

- డాక్టర్ నవనీత, పీహెచ్‌సీ ఇన్‌చార్జి



ఎమ్మెల్యే కృష్ణారావును సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

కూకట్‌పల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మూసాపేట్ డివిజన్‌లోని అవంతీనగర్ సాయిబాబా ఆలయ 7వ వార్షికోత్సవానికి కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్, కూకట్‌పల్లి కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ సీహెచ్ సత్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి సీఐగా ముత్తు

కూకట్‌పల్లి, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి సీఐగా కే.ముత్తు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన కృష్ణమోహన్ మాదాపూర్ పీఎస్‌కు బదిలీ అయ్యారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఐటీ సెల్ విభాగంలో పని చేసిన కే.ముత్తును కూకట్‌పల్లి సీఐగా నియమించారు.

నేడు మోతీనగర్‌లో ఎమ్మెల్యే పర్యటన

అల్లాపూర్: మూసాపేట్ డివిజన్ వార్డు కార్యాలయంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించనున్నారు. మోతీనగర్ ఈ-సేవ భవనంలోని వార్డు కార్యాలయంలో ఉదయం 9 గంటలకు వివిధ శాఖల అధికారులు పాల్గొంటారని, సమావేశంలో అభివృద్ధి పనులపై సమీక్షించనున్నారు.

ఏపీ టూ హైదరాబాద్ గంజాయి రవాణా

- రూ.8 లక్షల విలువ చేసే ఎండు గంజాయిని పట్టుకున్న పోలీసులు
- ముగ్గురి అరెస్ట్, ఒకరు పరారీ



నిందితుల వివరాలను వెల్లడిస్తున్న డీసీపీ కోటిరెడ్డి

పేట్‌బషీరాబాద్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి నగరానికి గంజాయి రవాణా చేస్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 33 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ డీసీపీ శ్రీనివాస్, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రాములు, ఎస్‌ఓటీ సీఐ శ్యామ్‌సుందర్‌రెడ్డి, శామీర్‌పేట్ సీఐ శ్రీనాథ్‌లతో కలిసి మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి ఆదివారం వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, ఏలూరు మండలానికి చెందిన గేదెల సతీష్(34) కృష్ణా జిల్లా గన్నవరానికి చెందిన కొరాడ సాయికుమార్(26) విశాఖపట్నం చంద్రయ్యపేటకు చెందిన బండారు శివకుమార్(27), ఒడిస్సాకు చెందిన శివ రాజమండ్రిలో ఉంటూ ఒక ముఠాగా ఏర్పడ్డారు. ఈజీ మనీ కోసం అలవాటు పడి గంజాయి సరఫరా చేయాలని నిర్ణయించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పనసపండ్ల లోడ్ మధ్యలో 16 బండిల్స్‌లో 33 కేజీల ఎండు గంజాయిని హైదరాబాద్‌కు తీసుకొస్తున్నారు. అయితే ముందు రెండు కిలోమీటర్ల మేర పోలీసుల కదలికలను గమనించేందుకు ఒక పైలెట్ వాహనాన్ని ఏర్పాటు చేసుకొన్నారు. గంజాయి సరఫరా చేసే వారికి వీరు ఎప్పటికప్పుడు సమాచారాన్ని చేరవేస్తున్నారు. పక్కా సమాచారం అందుకున్న మేడ్చల్ జోన్ ఎస్‌ఓటీ, శామీర్‌పేట పోలీసులు సంయుక్తంగా శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓఆర్‌ఆర్ ఎగ్జిట్ నుంచి కరీంనగర్‌కు వెళ్లే రాజీవ్ రహదారిలో వాహనాలను తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఏపీ 39 యూయూ 4550 నెంబరు గల వాహనం, ఏపీ 39 హెచ్‌జీ 9909 కారును ఆపి తనిఖీ చేశారు. పనస పండ్ల లోడ్‌లో 33 కేజీల గంజాయిని పోలీసులు గుర్తించి రవాణా చేస్తున్న వారిని అదుపులోకి తీసుకున్నారు. తర్వాత తమదైన శైలిలో విచారించగా గంజాయిని ఆంధ్రప్రదేశ్ నుంచి హైదరాబాద్ శివారుప్రాంతాల్లో విక్రయించేందుకు తీసుకు వెళ్తున్నట్లు అంగీకరించారు. వీరి నుంచి రూ.8 లక్షల విలువ చేసే 33 కిలోల గంజాయి, రెండు వాహనాలు, 4 సెల్‌ఫోన్లు, రూ.50 వేల నగదును స్వాధీనం చేసుకున్నట్లు మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి తెలిపారు. నలుగురు నిందితుల్లో శివ పరారీలో ఉండగా, సతీష్, సాయికుమార్, శివకుమార్‌లను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. సతీష్‌పై ఆంధ్రప్రదేశ్‌లో 4, సాయికుమార్‌పై 2 కేసులున్నాయని, వీరిద్దరూ పాత నేరస్తులన్నారు. గంజాయిని పట్టుకున్న ఎస్‌ఓటీ, పోలీసులకు సీపీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. త్వరలోనే వీరికి రివార్డును అందజేయనున్నట్లు డీసీపీ తెలిపారు.



సమావేశం జ్యోతిప్రజ్వలన కార్యక్రమంలో అతిథులు

అవకాశాలను ఇచ్చిపుచ్చుకుందాం

- బ్రాహ్మణ ఐటీ ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో తీర్మానం

కేపీహెచ్‌బీకాలనీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): అవకాశాలను ఇచ్చిపుచ్చుకుంటేనే అంతర్జాతీయంగా రాణించగలమని బ్రాహ్మణ ఐటీ ఉద్యోగులు అభిప్రాయపడ్డారు. బ్రాహ్మణ సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం కేపీహెచ్‌బీలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయ ప్రాంగణంలో బ్రాహ్మణ ఐటీ ప్రొఫెషనల్స్ గెట్ టుగెదర్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తత్వం చారిటబుల్ వ్యవస్థాపకుడు బంగారయ్య, సినీనటులు ప్రదీప్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐటీ రంగంలో ఉన్నత శిఖరాలను అధిరోహించిన వారు.. పేదలను ఆదుకోవడం, అలాగే బ్రాహ్మణ సంఘాలు నిర్వహించే ధార్మిక కార్యక్రమాల కోసం సమయం వెచ్చించాలని కోరారు. ఐటీ ప్రముఖులను శాలువాలతో సత్కరించి మెమోంటోలను ప్రదానం చేశారు. వివిధ కంపెనీల్లో పని చేస్తున్న బ్రాహ్మణ ఐటీ ఉద్యోగులను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు కృషి చేసిన శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కారులో సీఎన్జీ సిలిండర్ మాటున..

- పాత నేరస్థుడు అరెస్టు
- 31.2 కేజీల గంజాయి, కారు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న గంజాయి, కారు

కొత్తపేట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి) : కారులో సీఎన్జీ గ్యాస్ సిలిండర్ కింద ఉంచి గుట్టుగా గంజాయి రవాణా చేస్తున్న పాత నేరస్థుడిని నగర శివారు తట్టిఅన్నారం వద్ద నాగోల్ పోలీసులు అరెస్ట్ చేశారు. 31.2 కేజీల గంజాయి పాకెట్లు, కారు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌హెచ్‌ఓ సుధీర్‌కృష్ణ కథనం ప్రకారం.. విజయవాడకు చెందిన బోయినపల్లి సురేష్(35) కారు డ్రైవర్. సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి అక్రమ రవాణా చేస్తున్నాడు. గతంలో 2022లో గంజాయి సరఫరా చేస్తుండగా.. భద్రాచలం పోలీసులకు చిక్కి జైలుకెళ్లాడు. ఇటీవల ఖమ్మంలో అతడికి పాత పరిచయస్తుడు తారసపడ్డాడు. గంజాయి రవాణా చేసి అందిస్తే డబ్బులు ఇస్తామని చెప్పడంతో అందుకు సురేష్ అంగీకరించాడు. సురేష్‌కు సీఎన్జీ సిలిండర్ ఉన్న మారుతీ కారు ఇచ్చాడు. ఆ గ్యాస్ సిలిండర్‌ను గంజాయి భద్రపరిచేందుకు వీలుగా తయారు చేశారు. సురేష్ గంజాయి తరలిస్తున్న విశ్వసనీయ సమాచారం అందడంతో ఆదివారం ఉదయం ఎస్‌ఓటీ పోలీసులు, నాగోల్ పోలీసులు తట్టిఅన్నారం వద్ద వాహనాల తనిఖీల్లో భాగంగా కారును పట్టుకున్నారు. డ్రైవర్ సురేష్ ను అదుపులోకి తీసుకుని, సీఎన్జీ సిలిండర్‌లో తరలిస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ గంజాయిని నిజామాబాద్ నుండి హైదరాబాద్‌కి తరలిస్తున్నట్లు విచారణలో తేలింది.

షూటింగ్‌లో డా.వంశీధర్‌కు బంగారు పతకం



గోల్డ్‌మెడల్ సాధించిన డాక్టర్ వంశీధర్

పంజాగుట్ట, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర షూటింగ్ చాంపియన్ షిప్ పోటీలో డాక్టర్ వంశీధర్ నాలి హ్యాట్రిక్ గోల్డ్‌మెడల్ సాధించారు. నగరంలో శాట్స్ రేంజ్‌లో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని అగ్రశ్రేణి షూటర్లు పాల్గొన్నారు. 10 మీటర్ల రైఫిల్ మాస్టర్‌మెన్ వ్యక్తిగత విభాగంలో 380/400 స్కోర్ సాధించి వంశీధర్ గోల్డ్‌మెడల్ కైవసం చేసుకున్నారు. ఇది వరుసగా మూడో గోల్డ్‌మెడల్. ముగింపు కార్యక్రమంలో రోడ్డు సేఫ్టీ డీజీ అంజనీకుమార్, తెలంగాణ రైఫిల్ అసోసియేషన్ అధ్యక్షుడు అమిత్ సాంఘీ, కార్యదర్శి జె.కిరణ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి

చాదర్‌ఘాట్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న లారీ ముందున్న బైక్‌ను ఢీ కొట్టడంతో దానిపై ప్రయాణిస్తున్న ఇద్దరిలో బైక్ నడుపుతున్న బీటెక్ విద్యార్థి తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనక కూర్చున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. చాదర్‌ఘాట్ ఎస్ఐ రవిరాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. జోగులాంబ గద్వాల్ జిల్లా, వడ్డేపల్లి మండలం, శాంతినగర్ గ్రామానికి చెందిన సోమన్న అలియాస్ శ్యామ్(23) ఇబ్రహీంపట్నంలోని ఏవీఎన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తన స్నేహితులతో కలిసి చైతన్యపురిలోని గదిలో ఉంటున్నాడు. పార్ట్ టైమ్‌గా ఉబర్ బైక్ రైడర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం కస్టమర్ వెంకటరమణ ఉబర్ బుక్ చేయగా అందుకు సోమన్న తన బైక్‌పై చైతన్యపురి నుంచి కాచిగూడ రైల్వేస్టేషన్‌కు తీసుకెళ్తున్నాడు. మలక్‌పేట అక్షయ్ హోటల్ సమీపంలోని న్యూ మార్కెట్ మెట్రో స్టేషన్ పిల్లర్‌నంబర్ 1443 వద్ద వెనక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో అదుపుతప్పింది. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న ఉబర్ రైడర్ సోమన్న రోడ్డుకు కుడివైపు కింద పడిపోగానే వెనక ఉన్న లారీ చక్రాల కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ వెనక కూర్చున్న కస్టమర్ వెంకటరమణ ఎడమ వైపు కిందపడడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. విషయం తెలియగానే చాదర్‌ఘాట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సోమన్న మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటన అనంతరం లారీ డ్రైవర్ ఆపకుండా వెళ్లిపోయాడని పోలీసులు తెలిపారు. కేసును చాదర్‌ఘాట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తరకం హాషిష్ డ్రగ్

- ఉత్తరాఖండ్ నుంచి నగరానికి..
- ఒకరి అరెస్ట్



హాషిష్ డ్రగ్, పోలీసుల అదుపులో నిందితుడు

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాల రహిత నగరంగా మార్చాలని పోలీస్ శాఖ ప్రయత్నిస్తోంది. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలను సరఫరా చేస్తున్న స్మగ్లర్స్‌పై ఉక్కుపాదం మోపుతున్నారు. దొరికిన ముఠాను దొరికినట్టే కటకటాల్లోకి నెడుతున్నారు. అయినా, కొత్త, కొత్త స్మగ్లర్స్ పుట్టుకొస్తున్నారు. తాజాగా ఉత్తరాఖండ్ నుంచి హాషిష్ అనే కొత్తరకం డ్రగ్‌ను గుట్టుగా నగరానికి తెచ్చిన స్మగ్లర్‌ను ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌టీఎఫ్(స్పెషల్ టాస్క్‌ఫోర్స్) పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 80 గ్రాముల హాషిష్ అనే కొత్తరకం డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. దాని విలువ రూ. 1.50లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కీసర మండలం రాంపల్లి గ్రామానికి చెందిన రిత్విక్ కొంతకాలం క్రితం ఉత్తరాఖండ్‌కు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో అక్కడ మనుగడలో ఉన్న హాషిష్ అనే మత్తుపదార్థాన్ని వెంట తీసుకొస్తున్నాడు. ఆదివారం రైల్లో హాషిష్ డ్రగ్‌తో వస్తున్నట్లు ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌ఎఫ్‌టీ పోలీసులకు సమాచారం అందింది. దాంతో ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌రావు తన టీమ్‌తోపాటు సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్ బృందంతో కలిసి సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మాటువేశారు. ఉత్తరఖండ్ నుంచి వయా ఢిల్లీ ద్వారా రైల్లో సికింద్రాబాద్‌కు చేరుకున్న రిత్విక్‌ను అక్కడే మాటువేసిన పోలీసులు పట్టుకున్నారు. అతడి వద్ద ఉన్న హాషిష్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా స్మగ్లర్‌ను పట్టుకున్న ఎస్‌టీఎఫ్ టీమ్‌ను ఎక్సైజ్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి అభినందించారు.

జీవితంపై విరక్తితో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

జవహర్‌నగర్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): 'చావంటే భయమేస్తుంది.. తప్పంత నాదే.. నా చావుకు ఎవరూ బాధ్యులు కారు.. నా తలరాత ఇంతే' అంటూ జీవితంపై విరక్తి చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు ముందు సెల్ఫీ వీడియో తీసుకుని ఉరేసుకున్నాడు. ఈ సంఘటన జవహర్‌నగర్ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్‌హెచ్‌ఓ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం బాలాజీనగర్‌లోని ఆనంద్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న రమేష్ (43) జిమ్ కోచ్‌గా పనిచేసేవాడు. 2011లో రమేశ్‌కు స్వాతితో వివాహం జరిగింది. వీరికి ఒక పాప పుట్టింది. 8 ఏళ్ల క్రితమే స్వాతితో విడాకులు తీసుకున్న రమేశ్ ఒంటరిగానే జీవిస్తున్నాడు. 6 మాసాలుగా ఏ పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉంటున్నాడు. తన సోదరుడు ఆనందరావు ఇంట్లోనే ఉంటున్నాడు. శనివారం అన్నం తినాలని ఆనందరావు కుటుంబీకులు పిలవడంతో లేటుగా వస్తానని చెప్పాడు. జూన్ 30న రమేశ్ టిఫిన్ తినడానికి రాలేదు. దీంతో వదిన భాగ్యలక్ష్మి, ఆమె కుమార్తె రమేశ్ గదికి వెళ్లడంతో ఉరేసుకుని కనిపించాడు. వారు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాప్రా చెరువును శుభ్రం చేసిన ఆర్‌కేఎస్‌సీ వలంటీర్లు



చెరువును శుభ్రం చేస్తున్న వలంటీర్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 30 (ఆంధ్రజ్యోతి): గ్రీనర్ టుమారో (రేపటి పచ్చదనం) అనే నినాదంతో రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ వలంటీర్లు కాప్రా చెరువును శుభ్రం చేశారు. ఆర్‌కేఎస్‌సీ (రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్) వలంటీర్లు, కాప్రా లేక్ రెవివల్ గ్రూప్, ఫేకోమత్ సంస్థ ప్రతినిధులతో కలిసి సంయుక్తంగా ఆదివారం పని చేశారు. మొత్తం 60 మంది కలిసి కాప్రా చెరువును పూర్తిగా శుభ్రం చేశారు. వచ్చే తరాలకు చెరువులు, పచ్చదనాన్ని అందించాలంటే ఇప్పటి నుంచే చర్యలు అవసరమనే ఆవశ్యకతను గుర్తించిన వలంటీర్లు కార్యాచరణకు పూనుకున్నారు. ఇలాంటి సేవలు కొనసాగుతాయని వెల్లడించారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

నిజాంపేట్, జూన్ 30(ఆంధ్రజ్యోతి): అధికారులతో చర్చించి ప్రజా సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్‌లోని బాలాజీహిల్స్‌కు చెందిన కాలనీవాసులు ఆదివారం శ్రీనివాస్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి సమస్యలను వివరిస్తూ, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డిని కాలనీవాసులు శాలువాతో సన్మానించారు.

తాగునీరు వృథా



జీడిమెట్ల డివిజన్‌లోని పైప్‌లైన్ రోడ్డులో ఉద్యానవనం సమీపంలో పైపులైన్ లీకేజీ కారణంగా రోజుల తరబడి తాగునీరు వృథాగా పోతోంది. తాగునీరు లీకేజీ అవుతుండడంతో ఆ ప్రాంతమంతా బురదమయంగా తయారైంది. అధికారులు త్వరగా స్పందించి తాగునీరు వృథా కాకుండా చూడాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

- పేట్‌బషీరాబాద్, జూన్ 30 (ఆంధ్రజ్యోతి)